సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోటో నంబర్‌కు వాట్సాప్‌ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

ముంపు ముప్పు..

చినపాటి వర్షానికే పొంగుతున్న గెడ్డలు ● కాలనీల్లోకి చేరుతున్న వరద, మురుగు నీరు ● శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకోలు



నీట మునిగిన కె.కాలనీ ప్రాథమిక పాఠశాలకు ఆనుకుని ఉన్న వాకర్స్ పార్క్(ఫైల్)



దయానందనగర్ సచివాలయం వద్ద చేరిన వర్షపు నీరు ఇలా...



చాకలిగెడ్డకు ఆనుకుని ఉన్న కాలనీలో ఇళ్ల వద్ద వర్షపు నీటి ప్రవాహం..



దయానందనగర్‌లో ఇళ్ల ముంగిట చేరిన వరద నీరు (ఫైల్)

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధిలోని పలు ప్రాంతాల్లో చిన్నపాటి వర్షాలకే నీటమునుగుతున్నాయి. చాకలిగెడ్డ పొంగి ఇళ్లలోకి సైతం వరద, బురద నీరు చేరుతోంది. దీంతో వర్షం పడితే గెడ్డను అనుకుని ఉన్న ప్రాంతాల వాసులకు కంటిమీద కునుకు ఉండడం లేదు.

ఇదీ పరిస్థితి..: కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారి నుంచి గొల్లకంచరపాలెం, రామ్మూర్తిపంతులపేట, గవర కంచరపాలెం ప్రాంతాల మీదుగా చాకలిగెడ్డ ప్రవహిస్తుంది. వర్షాలు పడే సమయంలో గెడ్డ పొంగి దయానందనగర్, ముత్యమాంబకాలనీ, రాజీవ్‌కాలనీ తదితర ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. చాకలిగెడ్డకు రక్షణగోడలు సక్రమంగా నిర్మించక పోవడంతో వరద నీరు లీకై ఇళ్లముంగిటకు చేరుతోంది. పగటి సమయంలోవర్షం కురిస్తే ప్రజలు అప్రమత్తంగా ఉంటున్నారు. రాత్రి సమయంలో కురుస్తే కాలనీ వాసులు నిద్రలో ఉండడంతో రెండు నుంచి మూడడుగుల లోతులో నీరు కాలనీల్లో చేరుతుంది.

పూడికలు అడ్డంకి...

చాకలిగెడ్డ దిగువ భాగంలో డీజిల్ క్వార్ట్స్ రహదారి కెనాల్ వద్ద పూడికలు సక్రమంగా తొలగించకపోవడంతో ముంపునకు ప్రధాన కారణమవుతోంది. ముంపు సమయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టినా సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దయానందనగర్‌లో సచివాలయం, వాకర్స్ పార్క్ నీటమునిగాయి. రాజీవ్‌కాలనీ, ముత్యమాంబకాలనీ, దయానందనగర్ కాలనీల్లో ఇళ్ల ముంగిటకు నీరు చేరడంతో ప్రజలు తోడుకోవడానికి నానా పాట్లు పడ్డారు. గెడ్డల్లో పూడికలు, కెనాల్ వద్ద అడ్డుగా ఉండే చెత్తాచెదారాలు తొలగించాలని ఫిర్యాదులు చేసినా ప్రయోజనం కనిపించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లోతట్టు ప్రాంతాలను వరదనీటి నుంచి కాపాడే రక్షణ చర్యలు చేపట్టాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లాం



చాకలిగెడ్డ లోతట్టు ప్రాంతం కావడంతో వరద నీరు ప్రవాహానికి ఇబ్బంది లేకుండా పారిశుధ్య సిబ్బందిని సిద్ధం చేశాం. ఏకధాటిగా వర్షాలు పడేసమయంలో దయానందనగర్ లోతట్టు ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. చాకలిగెడ్డ దిగువ భాగం వద్ద రైల్వేట్రాక్, వంతెన కెనాల్ వద్ద చెత్తాచెదారాలు అడ్డంగా నిలిచిపోవడంతో సమస్య పునరావృతం అవుతుంది. కెనాల్ ఎత్తు పెంచాలని జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో కోరాను. నిధులు మంజూరు అయితే సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.

–శరగడం రాజశేఖర్, కార్పొరేటర్, 56వ వార్డు



రాజీవ్ కాలనీకి ఆనుకుని ఉన్న ప్రధాన రహదారిలో వరద నీటిలో రాకపోకలు

విద్యుత్ లైటు.. వెలుగులు ఎటు?

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు ఎన్ఎస్‌టీఎల్ ఫ్యామిలీ గేట్ ఎన్ఏడీ నుంచి వంటిల్లు జంక్షన్‌కు వచ్చే రహదారిలోని విద్యుత్ లైటును అక్కడి టైల్స్ దుకాణం వైపునకు తిప్పేశారు. దీంతో ఈ రోడ్డులో విద్యుత్ వెలుగులు మాయమై.. దుకాణం వైపు ప్రసరిస్తున్నాయి. జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఈ దీపం టైల్స్ దుకాణానికా అన్నట్లుగా ఉందని ఇది చూసిన వారు అవాక్కవుతున్నారు. రోడ్డు వైపు ఉండే ఈ లైటును ఇటీవలే మార్చారని చెబుతున్నారు. ఇదే దారిలో ప్రయాణిస్తున్న అధికారులు, నాయకులకు ఈ దీపం కానరాకపోవడం విడ్డూరంగా ఉందని చర్చించుకుంటున్నారు. ఈ లైటును టైల్స్ దుకాణదారుడే తిప్పుకున్నాడా.. లేక జీవీఎంసీ విద్యుత్ అధికారుల ద్వారా సిబ్బంది చేత ప్రత్యేక సౌకర్యం పొందాడా.. అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు పరిశీలించి ఈ లైటును రోడ్డు వైపునకు మార్చాలని కోరుతున్నారు.



ఎన్ఏడీ - వంటిల్లు జంక్షన్ రోడ్డులోని టైల్స్ దుకాణం వైపునకు మార్చిన విద్యుత్ లైటు

మరిడిమాంబ.. చల్లగ చూడమ్మా



సేవ గరిడి చేస్తున్న కళాకారులు



మరిడిమాంబ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు పరిధిలోని మల్కాపురం గ్రామ దేవత మరిడిమాంబ ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పండ్లు,వస్త్రాలు,ఇతర పదార్థాలతో సారెను మేళతాళాల నడుమ సేవ గరిడీ చేస్తూ అప్పన్న కీర్తనలతో ఊరేగింపుగా వెళ్లి మరిడిమాంబను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.కనుల పండువగా జరిగిన మహోత్సవంలో గ్రామానికి చెందిన పలు సామాజిక వర్గానికి చెందిన ప్రజలు పాల్గొన్నారు.

కళాకారులతో సాంస్కృతిక వైభవం

దాబాగార్డెన్స్: అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ ఆధ్వర్యంలో 'టాలెంట్ హంట్'పేరిట ఆదివారం నృత్య పోటీలు నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. కళాకారులతో సాంస్కృతిక వైభవం కలుగుతుందన్నారు. నృత్య కళాకారులు నాట్యగురువులు చెప్పే ప్రతి అంశంపై చక్కటి అవగాహన పెంపొందించుకుని చక్కని నృత్య కళాకారులుగా ఎదిగి రాణించాలన్నారు. ఈ సందర్భంగా నృత్య కళల అభివృద్ధికి కృషి చేస్తున్న జి.రాజేశ్వరి, ఎం.రాజేశ్వరి, భవ్య రాశి, కల్యాణ్, నాట్య గురువులను ఘనంగా సత్కరించారు. పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రాలు, విజేతలకు జ్ఞాపికలను గాయకులు మహ్మద్ తాజ్, మహ్మద్ షకీల్ అందజేశారు. కార్యక్రమంలో నృత్య గురువులు, కళాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న అతిథులు

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన సేవ విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర పూజ జరిపారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.



నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

మంచిగా మెలగాలి

తాటిచెట్లపాలెం: రౌడీషీటర్లు తమ తీరు మార్చుకుని, సత్ప్రవర్తనతో మెలగాలని ఫోర్త్ టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ రైటర్ పి.లక్ష్మణ్ సూచించారు. స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లుకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు ఎటువంటి గొడవల్లో తలదూర్చకూడదని, మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీ షీటర్లుగా నమోదైన ప్రతి ఒక్కరూ సంబంధిత స్టేషన్‌లో విధిగా సంతకాలు చేయాలని, వీరి కదలికలపై ఏమైనా అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసకుని బైండోవర్ చేస్తామని లక్ష్మణ్ తెలిపారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న స్టేషన్ రైటర్ లక్ష్మణ్

ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహించాలి

అగనంపూడి: ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల స్థాయి లో ఈ నెల 16న ఓజోన్‌పొర వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు అర్థమయ్యేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఏపీఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ శిష్టు ఖగేశ్వరరావు చెప్పారు. అగనంపూడిలో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు ఆదేశాలు, ఏపీఎన్‌జీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ డైరెక్టర్ సూచనల మేరకు అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఓజోన్‌దినోత్సవం ఘనంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు అంబరిల్లా ర్యాలీ, చిత్రలేఖన పోటీలు నిర్వహించాలని, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సహకరించాలని కోరారు.

ట్రాన్స్‌కో.. మేలుకో!

పారిశ్రామిక ప్రాంతంలోని పలు విద్యుత్ స్తంభాలకు, ట్రాన్స్‌ఫార్మర్లకు పాదులు అల్లుకుంటున్నాయి.వీటి వల్ల విద్యుత్ వైర్లు రాపిడికి గురై విద్యుత్ సరఫరా నిలిచే అవకాశాలు ఉన్నాయి. ప్రధానంగా షిప్‌యార్డ్ సర్కిల్ నుంచి నౌసేనాభాగ్‌కు వచ్చే సేవా మార్గంలో ఈ సమస్యకు కనిపిస్తుంది. అధికారులు స్పందించి అల్లుకున్న పాదలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

- మల్కాపురం



షిప్‌యార్డ్ సర్కిల్ వద్ద అల్లుకున్న పాదు



కమర్షియల్ కాంప్లెక్స్ వద్ద ఇలా...



స్టాఫ్‌కాలనీ బస్టాప్ వద్ద మినీ ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న పాదు

క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయుడు మోహనరావుకు సత్కారం



మోహనరావు మాస్టార్ దంపతులను సత్కరిస్తున్న సహచర ఉపాధ్యాయులు

గోపాలపట్నం: ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన లక్ష్మీనగర్ ఈ బ్లాక్ ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు మెట్ట మోహనరావు దంపతులను ఆయన క్లాస్‌మేట్లు, సహచర ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఆయనను ఆనాటి స్నేహితులంతా ఆదివారం కలిసి శాలువాతో సత్కరించి అభిమానం చూపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మోహనరావు సేవా దృక్పథం గల వారని కొనియాడారు. తమ స్నేహితుడికి ఉత్తమ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బండి దుర్గేష్, ఐ.ఉమా మహేశ్వరరావు, టి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



తీర ప్రాంతాల్లో తొలగించిన ప్లాస్టిక్ వ్యర్థాలతో ధర్మేంద్ర మిత్ర బృందం

మల్కాపురం: నగరాన్ని ప్లాస్టిక్ వ్యర్థాలతో నాశనం చేసుకోకుండా.. పచ్చదనంతో మంచిగా కాపాడుకుందామని సామాజిక సేవా కార్యకర్త ముప్పిన ధర్మేంద్ర పిలుపునిచ్చారు. 58వ వార్డు శ్రీహరిపురానికి చెందిన ధర్మేంద్ర తన స్నేహితులతో కలిసి ఆదివారం యారాడ, నగరంలోని ఆర్కే బీచ్, రుషికొండ బీచ్ వద్దకు వెళ్లి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలిగించారు. ఆ ప్రాంతంలో మొక్కలు పెంచడం వల్ల కలుగే లాభాలు, ప్లాస్టిక్ వినియోగం వల్ల నష్టాలపై అక్కడి వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా స్నేహితులతో కలిసి కొంత కాలం నుంచి పచ్చదనం పెంపునకు అవసరమైన చర్యలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పారిశ్రామిక ప్రాంతంలో ఐదేళ్లలో సుమారు 2 వేల మొక్కలు నాటామన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి శుభకార్యం నాడు ఓ మొక్క నాటాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక యువత పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమంతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కె.ఎస్.చలం

సీతంపేట: దళిత బహుజనులు ఏకం కావాలని, హక్కుల కోసం ఐక్య ఉద్యమమే మార్గమని ద్రావిడ యూనివర్సిటీ రిటైర్డ్ వీసీ ప్రొఫెసర్ కె.ఎస్.చలం అన్నారు. భీమ్‌సేన వార్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన సదస్సులో బహుజనులారా మీరు ఎటు వైపు అనే అంశంపై ఆయన ప్రసంగించారు. బహుజనులంతా అనేక పార్టీల కింద విభజించి ఉన్నారని, వారంతా ఏకమై హక్కుల సాధన, రాజ్యాధికారం దిశగా పయనించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, పెరియార్ రామస్వామి కలిసి దేశమంతా తిరిగి ఉద్యమాన్ని నిర్మించారన్నారు. రిజర్వేషన్లు తొలిసారి తమిళనాడులో అమల్లోకి వచ్చాయని, వాటికి ఆటంకం ఏర్పడితే 1951లో రాజ్యాంగ సవరణ జరిగిందన్నారు. సిక్కోలు బుక్ ట్రస్టు సంపాదకుడు దుప్పల రవికుమార్ అస్తిత్వ స్పృహ అనే అంశంపై మాట్లాడుతూ భారతదేశం 6300 కులాలుగా, ఎస్సీ, ఎస్టీ, బీసీలను చీల్చి వేసి వారి మధ్య ఐక్యత లేకుండా విష సంస్కృతిని సృష్టించారన్నారు. అనంతరం సదస్సులో పలు తీర్మానాలు ఆమోదించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వసంత రాజేంద్రప్రసాద్, కె.చిన్నారావు, కనకరాజు, మధు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పవిత్రోత్సవాలు, అధ్యయనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యా యి. త్రయాహినిక దీక్షతో ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ ఈకే చారి దంపతు లు తెలిపారు. సోమవారం శ్రీకృష్ణ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, సాయంత్రం ఉట్ల సంబరాలు ఉంటాయని చెప్పారు. అలాగే 16న లక్ష కుంకుమపూజ, 17న లక్ష తులసీ పూజ, పూర్ణాహుతి జరిపించనున్నామని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వేంకటేశ్వరస్వామి దివ్య ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.